క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ కరగ్రహారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 30వ తేదీ మంగళవారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బాబానగర్, పెదకరగ్రహారం, క్యాంప్ బెల్‌పేట, ఆశీర్వాదపురం, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు ఉల్లిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వివిధ విభాగాల వైద్యనిపుణులు పరీక్షలు చేసి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, హరిపురం, స్వతంత్రపురం, శ్రీరామపురం ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని వివేకానంద మందిరంలో సోమవారం 177వ శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ త్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీమణులు చేసిన బృందగానం శ్రోతలను అలరించాయి. లత, కిరణ్మయి, పావని, లీలా కామేశ్వరి, శ్రావ్య, ప్రవల్లిక, శిరీష, శ్యామల, కళ్యాణి, ప్రవీణ, శృతిలు ఆలపించిన బృందగానాలు ఆకట్టుకున్నాయి. వీరికి వీణపై వాయిద్యా సహకారాన్ని లలిత అందించారు. ఇంకా పలువురు గాయనీమణులు చేసిన బృందగానాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను త్యాగరాజ సంగీత విద్యాపీఠం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి కల్యాణి, కోశాధికారి లక్ష్మీకాంత్, నిర్వాహక కార్యదర్శి ఉమా పర్యవేక్షించారు.

విద్యుత్ బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ



మచిలీపట్నంటౌన్: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారులు సోమవారం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. స్థానిక ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం నుంచి ఈఈ భాస్కరరావు, టెక్నికల్ ఏఈ నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. 2024–25 సంవత్సరానికి బడ్జెట్ వివరాలను ఈపీడీసీఎల్ చైర్మన్ పృథ్వీతేజ్, ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్ చైర్మన్ కె.సంతోష్‌రావు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2023–24లో రూ. 10 కోట్లతో విద్యుత్ ప్రమాదాల నష్టపరిహార నిధిని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 192 గాయపడిన, మరణించిన కుటుంబాలకు రూ.9.10 కోట్లు, 198 పశువులకు రూ. 61 లక్షలు నష్టపరిహారం అందించామని తెలిపారు. 2024–25లో ఎల్‌టీ, హెచ్‌టీ అమ్మకాలు 28,686 మిలియన్ యూనిట్లకు గానూ ఆదాయం రూ. 15,175 కోట్ల మేర వస్తుందని అంచనా వేశారు. ఇలా ప్రతి అంశానికి సంబంధించి బడ్జెట్ అంచనాలను వివరించారు. మంగళ, బుధవారాల్లో కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని వినియోగదారులు తమ కార్యాలయానికి విచ్చేసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫిర్యాదులను తెలపవచ్చని ఈఈ భాస్కరరావు తెలిపారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు పెదగుడుమోటులో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శేషుకుమార్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.12 లక్షల నిధులు మంజూరు చేసిందని, వాటితో నిర్మించినట్లు సీడీపీఓ తెలిపారు. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చినట్లు చెప్పారు. బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారంతో నిర్వాహకులు ఏర్పాటు చేసిన రంగవల్లి ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిట్టిప్రోలు బ్రహ్మారావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, పరిశె వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు అన్సారీ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా

- వైఎస్సార్ ఆసరా వేడుకల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- 9,864మందికి రూ.10.46 కోట్ల నగదు చెక్కు పంపిణీ



కోడూరులో ఆసరా చెక్కును డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థికాభ్యున్నతి వైపు అడుగులు వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు టీటీడీ కల్యాణ మండపం వద్ద వైఎస్సార్ నాలుగో విడత ఆసరా వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఏరియా కో–ఆర్డినేటర్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రమేష్‌బాబు మాట్లాడారు. అధికారంలోకి రాగానే డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పిన మాటలకు జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి, చేయూత, పావలా వడ్డీ రుణాలు, కాపునేస్తం, ఆసరా, విద్యాకానుక, వసతి దీవెన లాంటి అన్ని పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యమిచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆసరా ద్వారా అవనిగడ్డ నియోజకవర్గంలోనే రూ.250 కోట్ల నగదును మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలను ప్రభుత్వం బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలకు అక్కడే పరిష్కారం చూపడానికి, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడానికి సచివాయాలను, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్య వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి, ప్రభుత్వం పేదవారికి అండగా నిలిచిందని రమేష్‌బాబు చెప్పారు.

చెక్కు అందజేత

మండలంలోని 9,864మంది మహిళలకు నాలుగో విడత ఆసరా కింద విడుదలైన రూ.10.46 కోట్ల నగదు చెక్కును డ్వాక్రా మహిళలకు రమేష్‌బాబు అందించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచులు వెన్నా షైనీ, వెగ్రీ పావని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, ఎంపీటీసీలు గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, పరిశె వెంకటేశ్వరరావు, ముక్కు వెంకటేశ్వరరావు, సనకా శైలజ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కేడీసీసీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబడటం లేదు



వేకనూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

వేకనూరు(అవనిగడ్డ): సీఎం చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడటం లేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని వేకనూరులో రూ.40.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టేనాటికి పీకల్లోతు అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలోనే మన రాష్ట్రానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. మంచి జరిగితేనే ఓటేయండి దమ్ముగా చెబుతున్న ముఖ్యమంత్రి ఇంత వరకూ ఎవరూ లేరని, ప్రజల్నే నమ్ముకుని ఆయన ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతువిభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తాగునీటిని అందించడానికి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు బందరు మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ తెలిపారు. నగరంలోని 21వ డివిజన్‌లోని వైఎస్సార్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన శంకుస్థాపనలో మేయర్ టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చొరవతో మచిలీపట్నానికి మెడికల్ కళాశాల మంజూరైందని నిర్మాణం పూర్తి చేసుకుని ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. కళాశాల అవసరాలకు తాగునీటిని అందించడానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన పైప్‌లైన్ నుంచి కళాశాల పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. దీంతో కళాశాలలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, 21వ డివిజన్ కార్పొరేటర్ మన్నే శారద, ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, బందరుకోట పీఏసీఎస్ అధ్యక్షుడు వేమూరి బదరీ నారాయణ, కార్పొరేటర్లు శ్రీరాం చిన్నా, పల్లి శేఖర్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): నర్సింగ్ కళాశాల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి ఫిబ్రవరి 5న శంకుస్థాపన జరగనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సమీపంలోనే నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వీవీ రామన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గస్థాయి పోటీలు



జిల్లా స్థాయికి ఎంపికైన బంటుమిల్లి మహిళల క్రికెట్ జట్టు

పెడన: ఆడుదాం ఆంధ్రా పోటీలు నియోజకవర్గ స్థాయిలో సోమవారం ముగిశాయి. బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ మహిళలు, పురుషులు జట్లు మొదటి స్థానానికి వేర్వేరుగా తలపడ్డాయి. పురుషుల క్రికెట్‌లో కృత్తివెన్ను, గూడూరు జట్లు పోటీ పడగా కృత్తివెన్ను జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు ఎంపికైంది. మహిళల విభాగంలో బంటుమిల్లి, కృత్తివెన్ను జట్లు పోటీపడగా 'బంటుమిల్లి' ప్రథమ స్థానంలో నిలిచింది. వాలీబాల్ విషయంలో పురుషులు, మహిళల్లో బంటుమిల్లి జట్లు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు ఎంపికయ్యాయి. బ్యాడ్మింటన్.. పురుషుల్లో పెడన టీం, మహిళల్లో బంటుమిల్లి జట్లు జిల్లాకు ఎంపికయ్యాయి. ఖోఖోలో మహిళలు, పురుషుల్లో కృత్తివెన్ను జట్లు జిల్లా స్థాయిలో ఆడనున్నాయి. కబడ్డీలో పురుషులు, మహిళల్లో కూడా బంటుమిల్లి జట్లు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో ఆడనున్నాయి. పెడన నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు పురస్కారాలను మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేయనున్నారని వైఎస్సార్ సీపీ పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి తెలిపారు.



హోరాహోరీగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం నోబుల్ కళాశాల ఆవరణలో హోరాహోరీగా జరిగాయి. మచిలీపట్నం నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో అర్బన్–ఎ, అర్బన్–బి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠగా జరిగింది. అర్బన్–బి జట్టు 106 పరుగులు చేయగా అర్బన్–ఎ జట్టు 55 పరుగులకే ఆలౌటైంది. దీంతో అర్బన్–బి జట్టు విజయం సాధించింది.

వండి వార్చే తప్పుడు రాతలు మానుకో రామోజీ

వైఎస్సార్ సీపీ శ్రేణులు



నాగాయలంక ప్రధాన కూడలిలో ఈనాడు ప్రతులను దగ్ధం చేసిన నాయకులు, కార్యకర్తలు

నాగాయలంక: అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబుపై 'ధిక్కార స్వరం' శీర్షికతో తప్పుడు వార్తా కథనం వండి వార్చిన ఈనాడు దినపత్రిక ప్రతులను సోమవారం నాగాయలంకలో వైఎస్సార్ సీపీ శ్రేణులు దగ్ధం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది వెంకట శేషగిరిరావు మాట్లాతూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా పాటించడానికి అనుక్షణం సిద్ధంగా ఉంటామన్నారు. తమ ఎమ్మెల్యే పదే పదే చెబుతున్నా ఈనాడు రామోజీరావు దుర్మార్గ చేష్టలు మానుకోవడంలేదని, ఆధారాలు లేని చెత్త వార్తలు వండి వారుస్తూ దిగజారిపోతున్నారని విమర్శించారు. డౌన్ డౌన్ రామోజీరావు అంటూ పార్టీ నాయకులు కార్యకర్తలు నినాదాలు చేసి ఈనాడు పత్రిక కాపీలను దగ్ధం చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, నాగాయలంక, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షులు ముమ్మారెడ్డి సాంబశివరావు(చంటి), తోట సాయిబాబు, పూర్వ డీసీ మాజీచైర్మన్ బీసాబత్తుని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: చంద్రబాబుకు అనుకూలంగా పని చేసే ఎల్లో మీడియా తప్పుడు కథనాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని) సూచించారు. స్థానిక ప్రధాన కూడలిలో సోమవారం ఈనాడు దినపత్రిక ప్రతులను వైఎస్సార్ సీపీ నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ కరీముల్లా ఖాన్, తుమ్మల వెంకటేశ్వరరావు, మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, మండల యూత్ కన్వీనర్ వెనిగళ్ల తారక జగదీష్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై ఈనాడు పత్రికలో వచ్చిన తప్పుడు కథనాలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. తొలుత మండల పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా గుడి సెంటర్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు గరికిపాటి గోవిందరాజులు, తుటారం కృష్ణ, రెడ్రొతు వెంకట రమణ, మండల ఎస్సీసెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కులగణన

నాగాయలంక: మండలంలో 16 సచివాలయాల పరిధిలోని 87.92 శాతం కుటుంబాల్లో 15,003 కుటుంబాల కులగణన వివరాల నమోదు పూర్తైనట్లు ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ సోమవారం చెప్పారు. ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ తదితర మండల స్థాయి వెరిఫికేషన్ అధికారులు ఐదుగురు విస్తృతంగా పర్యటిస్తూ కులగణన విధులను సమీక్షిస్తున్నారు. కులగణన పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 46,941మంది జనాభాలో 37,754(80.43%)మంది కులగణన వివరాలు సేకరిస్తున్నారు. 298 మంది ఎన్యుమరేటర్లు, 136 మంది సచివాలయ ఉద్యోగులు, ఆరుగురు మండల స్థాయి పర్యవేక్షకులు కులగణనలో నిరంతరం పని చేస్తున్నారని ఈఓపీఆర్డీ తెలిపారు.

పూరిల్లు దగ్ధం



కోడూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన కోడూరు మండలంలో చోటుచేసుకుంది. లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండూరి నాంచారమ్మ భర్త రంగారావు మరణించడంతో ఆమె పూరింటిలో నివసిస్తోంది. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి పనులు ముగించుకొని నాంచారమ్మ ఇంట్లో నిద్రపోయింది. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటి పైకప్పు నుంచి మంటలు వ్యాపించడాన్ని గమనించి నాంచారమ్మ బయటకు పరుగులు తీసింది. స్థానికులు స్పందించి మంటలు పక్కకు వ్యాపించకుండా అదుపు చేశారు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించి, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. ప్రమాదంలో రూ.60 వేల నగదు, 20 గ్రాముల బంగారం, విలువైన గృహోపకరణలు, పత్రాలు దగ్ధమైనట్లు బాధితురాలు నాంచారమ్మ తెలిపారు. రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రముఖులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'సిద్ధం' విజయవంతం చేద్దాం


వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము



మాట్లాడుతున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిబ్రవరి 3న ఏలూరులో నిర్వహించనున్న ఎన్నికల సమరభేరి 'సిద్ధం' మహాసభకు పార్టీ శ్రేణులు హాజరుకావాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటన చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాము మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పెత్తందారుల ఎత్తుగడల నుంచి పేదవాడికి విజయాన్ని అందించాలన్నారు. ప్రతి పేదవాడి కళ్లలో ఆనందం కలకాలం నిలవాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. సిద్ధం మహాసభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి, దేవస్థానం చైర్మన్ నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జిల్లా బోర్డు సభ్యుడు పట్టపు నాని, ఎస్సీ సెల్ కన్వీనర్ జాన్‌రత్నం, యండపల్లి సర్పంచు ప్రభుప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ బాపూజీ, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీపై సమీక్ష



ఇళ్ల పట్టాల పంపిణీపై సమీక్ష నిర్వహిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, పక్కన ఆర్డీఓ ఎం.వాణి

గూడూరు: నవరత్నాలు– అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గూడూరు మండలంలో కోర్టు కేసుల కారణంగా పంపిణీ కాని నివేశన స్థలాలపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సమీక్షించారు. గూడూరు–1 సచివాలయాన్ని సోమవారం ఉదయం బందరు ఆర్డీఓ ఎం.వాణితో కలిసి జేసీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో పంపిణీ కాని ఇళ్ల స్థలాల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీలార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ మండలంలో గూడూరు, ఐదుగుళ్లపల్లి, రామరాజుపాలెం, ఆకులమన్నాడు గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీపై కోర్టుల్లో కేసుల కారణంగా జాప్యమవుతోందన్నారు. గూడూరులో గ్రామ కంఠంగా ఉన్న భూములపై స్థానిక రైతులు కోర్టుకు వెళ్లడంతో ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయని వివరించారు. రామరాజుపాలెంలో అందుబాటులో ఉన్న సీలింగ్ భూములను ఇళ్ల పట్టాలకు ఎంపిక చేసి పంపిణీ చేయగా అక్కడ కూడా రైతులు కోర్టుకు వెళ్లారన్నారు. ఐదుగుళ్లపల్లి, ఆకులమన్నాడు గ్రామాల్లో కూడా కోర్టు కేసుల కారణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై స్పందించిన జేసీ కోర్టు కేసుల ప్రస్తుత స్థితిని తనకు నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ రాజేశ్వరి, డీటీ శివశంకర్, వీఆర్వోలు కరీముల్లా, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాటి ట్రస్ట్ నిర్వాహకుడు చంద్రశేఖరరావు మృతి



ఘంటసాల(అవనిగడ్డ): గొర్రెపాటి వెంకటనారాయణ– ఉదయభాస్కరమ్మ విద్యాట్రస్ట్ నిర్వాహకుడు గొర్రెపాటి చంద్రశేఖరరావు(83) మరణించారు. ఆయన భౌతికకాయానికి సోమవారం ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, ఉపాధిహామీ, పశుసంవర్ధక శాఖ, ఇరిగేషన్, డ్రెయినేజీ, హౌసింగ్, తదితర శాఖలపై ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సమీక్ష జరిపారు. శాఖలవారీగా తాము చేస్తున్న కార్యక్రమాలపై అధికారులు ప్రగతి వివరాలను సభ్యులకు తెలియజేశారు. వివిధ సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు.

గురివిందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవీకాలం పూర్తి కావస్తున్నా భవన నిర్మాణం ఎప్పుడు చేస్తారంటూ ప్రశ్నించారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ ఎం. కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరులోని పలు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై సోమవారం పోలీసులు మెరుపు దాడులు చేశారు. దాడుల్లో 13 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. బందరు రూరల్ పరిధిలోని సీతారామపురంలో పేకాట శిబిరంపై రూరల్ ఎస్సై పద్మ దాడి చేసి పది మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.210 స్వాధీనపర్చుకున్నారు. ఇనకుదురుపేట పీఎస్ పరిధిలోని రాజుపేట నూరినగర్‌లో పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న సీఐ విద్యాసాగర్ సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసులు వారి నుంచి రూ.26,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్లను స్టేషన్‌కు తరలించిన ఆయా స్టేషన్ల అధికారులు మంగళవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఉన్నట్లు తెలిపారు.

పెడన: కూడూరులో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పెడన పోలీసులు సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.3,600, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ పేర్కొన్నారు.

బందరు మండలం హుస్సేన్‌పాలెంకు చెందిన శ్రీకాకుళపు పైడేశ్వరరావు అనే వ్యక్తి పెడన నుంచి 13 క్వార్టరు లిక్కర్ బాటిల్స్ తరలిస్తుండగా అతన్ని పట్టుకుని అరెస్ట్ చేసి, బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గూడూరు: గ్రామంలో పేకాడుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో పెడన ఇన్‌స్పెక్టర్ ఎండీ హబీబ్ బాషా ఆధ్వర్యాన గూడూరు ఎస్సై శేషు కుమార్, సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని వారి నుంచి రూ. 1,01,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ హబీబ్ బాషా వెల్లడించారు.

వీరాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.4.6లక్షలు

పామర్రు: ఉంగ్రపూడి–పోలవరం అడ్డరోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయ హుండీలోని కానుకల లెక్కింపులో రూ.4.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. సోమవారం ఆలయంలో జరిగిన కానుకల లెక్కింపును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆలయంలోని హుండీల్లో భక్తులు 68 రోజుల పాటు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. యనమలకుదురు కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు పర్యవేక్షణలో కానుకలు లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.